క్లుప్తంగా

దేవస్థానానికి నగదు విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి మంగళవారం ఎంఆర్ కల్యాణ మండపం అధినేత మలిరెడ్డి దంపతులు రూ.50 వేలు నగదు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

మనుబోలు: మనుబోలు కోదండరామపురం దేవాంగుల వీధిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు పోలేరమ్మకు పంచామృతాలు, వివిధ రకాలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గాజులతో ప్రత్యేకాలంకరణ చేశారు. ఉభయకర్తలుగా పొట్టి నాగేంద్ర, అనురాధ దంపతులు వ్యవహరించారు.

విద్యార్థికి అభినందన



ఇందుకూరుపేట: విజయవాడలో రెండు రోజుల క్రితం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ - 19 ఎస్జీఎఫ్ బాక్సింగ్ పోటీల్లో కొత్తూరు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి నావూరు సతీష్ కాంస్య పతకాన్ని సాధించారు. ఈ క్రమంలో పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున సత్కరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు అరోరాకు అభినందనలను తెలియజేశారు.

గ్రామసభ రసాభాస



కార్యదర్శితో రైతు వాగ్వాదం

విడవలూరు: మండలంలోని దంపూరులో మంగళవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. అనేక సమస్యలపై తహసీల్దార్ చంద్రశేఖర్‌కు అర్జీలను రైతులు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే జరిపిన అనంతరం తమ పొలాల సర్వే నంబర్లను తప్పుగా ఎక్కించారని ఆరోపించారు. పట్టా భూములను చుక్కల భూములుగా చూపి కంప్యూటర్‌లో నమోదు చేశారంటూ వీఆర్వో సులోచనమ్మను రైతులు నిలదీశారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆమెను గ్రామంలో ఎలా కొనసాగిస్తారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సర్పంచ్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదం



వరిగొండ దేవళాలమిట్ట సమీపంలో మలుపులు

తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండ మార్గంలో ఉన్న రెండు మలుపులు ప్రమాదకరంగా మారాయి. వరిగొండ దేవళాలమిట్ట సమీపంలో, మండల కేంద్రం తోటపల్లిగూడూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో ఈ రెండు మలుపులు పక్క పక్కనే ఉన్నాయి. ఇక్కడ తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మలుపుల వద్ద చిన్నపాటి స్పీడ్ బ్రేకర్లున్నా అవి వాహనాల వేగాన్ని నియంత్రించలేకున్నాయి. అంతేకాక హెచ్చరిక బోర్డులు లేవు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వామ్మో.. క్రాస్‌రోడ్లు

మండల పరిధిలోని జాతీయ రహదారి నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే క్రాస్‌రోడ్లు మృత్యుద్వారాలుగా మారాయి. వాటి వద్ద ఏటా జరిగే ప్రమాదాల్లో పదుల సంఖ్యలో వాహనచోదకులు చనిపోతుండగా అంతకు రెట్టింపు సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారు.

- తరచూ ప్రమాదాలు
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- జాడలేని సైన్ బోర్డులు



బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద ఇలా..

మనుబోలు: మండలంలోని పోర్టు క్రాస్‌రోడ్డు నుంచి బద్దెవోలు క్రాస్‌రోడ్డు వరకూ 12 కిలోమీటర్ల మేర 16వ నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. దీని నుంచి రోడ్డుకిరువైపులా ఉన్న వివిధ గ్రామాలకు వెళ్లేందుకు మార్గాలున్నాయి. ప్రస్తుతం మండల పరిధిలో బద్దెవోలు, యాచవరం, వీరంపల్లి, కాగితాలపూరు, కొమ్మలపూడి, గురివిందపూడి, జట్ల కొండూరుతోపాటు మనుబోలు మండల కేంద్రానికి ఉత్తర, దక్షిణం రెండు వైపులా హైవే నుంచి క్రాస్‌రోడ్లున్నాయి. గ్రామాలకు వెళ్లే వారు వాటిని దాటాల్సి ఉంటుంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే హైవేపై ట్రాఫిక్ అధికంగా ఉంటోంది. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇవి లేకపోవడంతో..

క్రాస్‌రోడ్డు ఉందని సూచించే సైన్ బోర్డులు సైతం కొన్నిచోట్ల లేవు. దీంతో హైవేపై రాకపోకలు సాగించే వాహనాల డ్రైవర్లకు అక్కడ ఎవరైనా పాదచారులు లేదా వాహనాలు రోడ్డు దాటే అవకాశం ఉందనే విషయం తెలియడం లేదు. దీనికితోడు మండల పరిధిలో హైవే పక్కన పది హోటళ్లు, 60కు పైగా వివిధ రకాల దుకాణాలున్నాయి. వీటి కోసం డ్రైవర్లు లారీలను హైవేపైనే ఆపుతున్నారు. ఇవి కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇకనైనా పోలీసులు స్పందించి హైవేపై క్రాస్‌రోడ్ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వీరంపల్లి క్రాస్‌రోడ్డు



→ సిద్దారెడ్డి వెంకటరమణారెడ్డిది తిరుపతి జిల్లా కోట మండలంలోని విద్యానగర్. ఈయన వారం రోజుల క్రితం నెల్లూరు నుంచి స్వగ్రామానికి మోటార్‌బైక్‌లో వెళ్తున్నాడు. ఈ క్రమంలో బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద గూడూరు నుంచి కొలనకొదురు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొనడంతో వెంకటరమణారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు.

చర్యలు చేపట్టాలి



హైవేపై తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలి. చాలాచోట్ల రోడ్డుపైనే లారీలను ఆపేస్తుండడంతో ఇతర వాహనాలు వెళ్లేందుకు దారి ఉండడం లేదు. హైవేపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆపకుండా చర్యలు తీసుకోవాలి. అలాగే క్రాస్‌రోడ్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు వాహనాల వేగాన్ని నియంత్రించాలి.

– బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మనుబోలు

డ్రమ్ములు ఏర్పాటు చేయించాం



ఇటీవల హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న విషయం వాస్తవమే. అయితే ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బద్దెవోలు, పోర్టు క్రాస్‌రోడ్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు హైవేపై రేడియం స్టిక్కర్లున్న డ్రమ్ములను ఏర్పాటు చేయించాం. స్థానికంగా ఉండే ఆటోవాలాలకు ప్రమాదాల నియంత్రణపై అవగాహన కలిస్తున్నాం.

– శివరాకేష్, ఎస్సై

ఐదుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులను డిబార్ చేశారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 7,298 మందికి గానూ 6,763 మంది హాజరైనట్లు వెల్లడించారు.

అరెస్ట్ చేయడం దారుణం

మనుబోలు: ముందస్తు సమాచారం ఇవ్వకుండా కొమ్మలపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చెందులూరు శ్రీనివాసులును అరెస్ట్ చేయడం దారుణమని ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు అన్నారు. మంగళవారం వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని శ్రీనివాసులుపై మోపబడిన అభియోగాలపై ఎస్సై శివరాకేష్‌తో చర్చించారు. న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్ రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, చేవూరు ఓసూరయ్య, దాసరి భాస్కర్‌గౌడ్, చల్లా నవకోటి, ఆవుల తులసీరాం, బండెల వేణుగోపాల్, ఆవుల వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్స్ పోటీలకు కోదండరామయ్య

కోవూరు: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ క్యారమ్స్ ఎంపికల్లో పడుగుపాడులోని స్టో బీడీ కాలనీ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ కోదండరామయ్య ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో నవంబర్ ఏడున నిర్వహించనున్న పోటీల్లో ఈయన పాల్గొననున్నారు. కాగా ఆయనకు ఎంఈఓ, ఉపాధ్యాయులు అభినందనలను తెలియజేశారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఆర్డీఓ అనూష



కోవూరు: పడుగుపాడులో..

- నెల్లూరు ఆర్డీఓ అనూష

పొదలకూరు: భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు నెల్లూరు ఆర్డీఓ అనూష పేర్కొన్నారు. మండలంలోని మరుపూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు మంగళవారం ఆర్డీఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లోనే సదస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పేర్ల నమోదులో పొరపాట్లు ఉంటే సరిదిద్దడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ సదస్సులో తహసీల్దార్ శివకృష్ణ, డీటీ సురేఖ, వీఆర్వో గుణశేఖర్, మాజీ ఎంపీటీసీ కె.ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోవూరు: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నిర్మలానంద బాబా పేర్కొన్నారు. పడుగుపాడులోని పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో రీ సర్వేకు సంబంధించిన గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రీ సర్వేకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా, అర్జీని అందజేస్తే వాటిని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఆర్ఐ రాకేష్, సర్వేయర్ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- చేనేత, జౌళి శాఖ ఏడీ వరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ వరప్రసాద్

పొదలకూరు: ముద్ర బ్యాంకు రుణాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సచివాలయం బిట్–2 లో మంగళవారం చేనేత కార్మికులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ముద్ర రుణం కింద ప్రతి కార్మికుడికి బ్యాంక్ ద్వారా రూ.50 వేలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. చేనేత, జౌళి అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధివిధానాల గురించి వివరించారు. అనంతరం ప్రధానమంత్రి వీవర్స్ దరఖాస్తులను చేనేత కార్మికులకు అందజేశారు. సదస్సులో సహాయ అభివృద్ధి అధికారి ప్రసాదరావు, చేనేత కార్మిక సంఘం నాయకులు సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

పందుల పెంపకందారుల తరలింపు



మాట్లాడుతున్న తహసీల్దార్

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో నెలకొన్న పందుల పెంపకందారుల తరలింపు విషయంలో చిక్కుముడి ఎట్టకేలకు వీడింది. ఎమ్మెల్యే సూచనల మేరకు నగర కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వీరిని తరలించే ప్రక్రియను మంగళవారం ప్రారంభించారు. మలిదేవి పక్కన నిరుపయోగంగా ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో కొంత మందికి ఆవాసం కలిపించారు. జగనన్న కాలనీలో ఏడుగురికి ఇళ్ల పట్టాలను గతంలో మంజూరు చేసి ఉండటంతో వారిని అక్కడికి తరలించారు. బుచ్చిరెడ్డిపాళెం సమీప ప్రాంతాల్లో ఎకరా స్థలాన్ని త్వరలో కొనుగోలు చేసి వీరికి నివేశన స్థలాలను మంజూరు చేయనున్నామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కాగా మరో ముగ్గురు తమ వద్ద పట్టాలున్నాయని చెప్పడంతో మంగలికట్టలో అలజడి నెలకొంది.

అధికారుల వైఖరి దారుణం



మాట్లాడుతున్న గుర్నాథం

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న పందుల పెంపకందారులను ఖాళీ చేయించే విషయంలో అధికారుల చర్యలు దారుణమని సీపీఎం జిల్లా నేత ముత్యాల గుర్నాథం ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 30 ఏళ్లకుపైగా పందులను పెంచుకుంటూ జీవిస్తున్నారని.. కాలక్రమేణ వారు వివిధ పనులు చేస్తున్నారని చెప్పారు. వీరిలో మార్పు తీసుకొచ్చి సక్రమంగా జీవించేలా ఏ ఒక్కరూ కృషి చేయలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే చొరవ చూపి వీరికి స్థలాలను కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. మల్లికార్జున, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్ వర్క్‌షాపులో 'గీతాంజలి' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

కోవూరు: జేఎన్టీయూ పులివెందులలో నిర్వహించిన రోబోటిక్స్ వర్క్‌షాపులో కోవూరులోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రథమ సంవత్సర బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. రాజా, ప్రతాప్ ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించారు. వీరిని ప్రిన్సిపల్ సందీప్‌కుమార్ అభినందించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి పద్మ శ్రావ్య, మురళీకృష్ణ, నీలిమ పాల్గొన్నారు.

పొదుపులో లంచాల బాగోతం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పొదుపు సంఘంలో బ్యాంక్ లోన్ ఇచ్చినప్పుడల్లా రూ.లక్షకు రూ. వెయ్యి వంతున ప్రతి సభ్యురాలు చెల్లించామని మండలంలోని నాగాయగుంట పొదుపు మహిళలు ఆరోపించారు. ఈ విషయమై వెలుగు అధికారులకు ఫిర్యాదు చేయడంతో, గ్రామంలో విచారణను మంగళవారం చేపట్టారు. స్త్రీనిధిలో రుణాల మంజూరులోనూ ఇదే విధంగా చెల్లించామని వాపోయారు. కాగా పొదుపు సంఘాల సభ్యుల ఫిర్యాదు మేరకు గ్రామంలో సిబ్బందితో విచారణ చేపట్టామని, ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని ఏపీఎం శ్రీధర్ తెలిపారు.

ఆయుర్వేద దినోత్సవం



మనుబోలు: మండలంలోని మడమనూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు జగదీశ్వరి మాట్లాడారు. ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అన్నదాతలకు అండగా ఉంటాం

- బ్యాంక్ ఆఫ్ బరోడా ఏజీఎం కిరణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏజీఎం

పొదలకూరు: రైతులకు అండగా ఉంటామని బ్యాంక్ ఆఫ్ బరోడా ఏజీఎం అండ్ రీజినల్ హెడ్ (గుంటూరు) ఎస్కే కిరణ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బోగోలు కృష్ణారెడ్డి కల్యాణ మండపం గ్రౌండ్ ఫ్లోర్లో మంగళవారం బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎస్ఈఎం, గృహ, విద్య రుణాలకు తమ బ్యాంక్ అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. సేవింగ్స్‌కు అధిక వడ్డీని అందజేయడం జరుగుతుందని, ఎడ్యుకేషన్ లోన్స్‌ను త్వరితగతిన అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రితీష్‌కుమార్, చీఫ్ మేనేజర్ చంద్రమౌళి పండేటి, బ్రాంచి మేనేజర్ రాజేష్ గంగినేని, భవన యజమాని బోగోలు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పొదలకూరు: 'రక్తదానం ప్రాణదానంతో సమానం. ఆరోగ్యవంతులు తమ రక్తాన్ని దానం చేయొచ్చు' అని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గూడూరు ఏరియా ఆస్పత్రి మదర్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడే వారికి తప్పసరిగా రక్తం అవసరం అవుతుందన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కారు ప్రయాణం చేసే వారు సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ప్రాథమిక నిబంధనలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలో నాలుగో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న యువకులను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ ఆర్.రాంబాబు, ఎస్సై ఎస్కే ఎండీ హనీఫ్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ నజ్మాసుల్తానా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి



కొడవలూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

పొదలకూరు: విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించకుంటే నష్టపోవాల్సి వస్తుందని పొదలకూరు సహాయ సంచాలకుడు కె.శివనాయక్ అన్నారు. మంగళవారం నావూరు, ప్రభగిరిపట్నం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రబీ సీజన్లో రైతులు నార్లు పోసుకునేందుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. మినుము, పెసర సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరి విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. కేఎంఎస్ 1638, బీపీటీ 5204 రకం వరి విత్తనాలను అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఓ ఎ.వాసు, ఏఈఓ ఏడుకొండలునాయక్, వీపీఏ అజయ్, వీహెచ్‌ఏ షఫీ తదితరులు పాల్గొన్నారు.

- కొడవలూరు: తడి.. పొడి విత్తన శుద్ధికి కార్బెండాజిమ్‌ను వేర్వేరుగా వినియోగించాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని కొడవలూరు, బసవాయపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కొడవలూరులో నారుమడులను పరిశీలించి చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా జెడ్బీఎన్ఎఫ్ సీఆర్పీలు రామ్‌ప్రసాద్, మహేంద్ర మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు గణనీయంగా తగ్గడంతో పాటు ఆరోగ్యకర ఉత్పత్తులను సాధించొచ్చని వివరించారు. ఏఈఓలు అనూష, వెంకట్రావు, వీఏఏలు శివజ్ఞాన, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.
- ఇందుకూరుపేట: ఆరెన్నార్ – 1548 రకం వరిని సాగు చేసే రైతులు నార్లు, నాట్లను నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15లోపు వేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని జంగంవానిదొరువులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ రఘునాథ్‌రెడ్డి, దీక్షిత తదితరులు పాల్గొన్నారు.
- విడవలూరు: విత్తనాల ఎంపిక విషయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య పేర్కొన్నారు. మండలంలోని దంపూరు సచివాలయం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.
- తోటపల్లిగూడూరు: వరి సాగులో రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని వరిగొండ – 1, వరిగొండ – 2 గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం నశించి పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితిలో పచ్చిరొట్టి విత్తనాలైన సేంద్రియ ఎరువులను వాడడం ఉత్తమమన్నారు. అనంతరం స్థానిక పంట పొలాల్లో వ్యవసాయాధికారులు క్షేత్ర సందర్శన చేపట్టి రైతులకు సలహాలను అందించారు. సాయిల్ హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి, ఏఈఓ ప్రసన్న, వీపీఏ సుమంత్, ఏహెచ్‌ఏ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విడవలూరు: దంపూరులో..



ఇందుకూరుపేట: జంగంవానిదొరువులో..



పొదలకూరులో..



టీపీగూడూరు: సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ